"ఛత్. ఎక్కడా దొరకములా వుంది" అన్నాడు తనలో తను గొనుక్కుంటున్నట్లుగా.

ఆటో ఎర్రగడ్డ ఆస్పత్రి ముందు ఆగగానే, అతను కిందికి దిగి, గబగబా గేటు వైపు నడిచాడు.

సాబ్, ఆటో ఫేర్, ఏడురూపాయల చిల్లరయింది." అరిచాడు డ్రయివర్ కూడా ఆటో దిగి, ఆగి జేబులు తడుముకుని అన్నాడా ప్రయాణీకుడు దీనంగా.

"లేదు. నిన్న రాత్రి మా నాన్నగారితో డాక్టరు అంటూంటే విన్నాను. మీ వాడు ఇరవై సంవత్సరాల నుంచి వుద్యోగం దొరకక పోవటంవల్ల పిచ్చయ్యాడు ఉద్యోగమే సరయినమందు అని. ఎక్కడైనా ఆ మందు దొరుకుతుందేమోనని ప్రయత్నం చేసాను నువ్వే చూశావుగా. దొరకలేదు ఆ సంగతి డాక్టర్‌తో చెప్పాలి. ఆయనకేపిచ్చి నిజానికి. అయినా వప్పుకోడు చస్తే".

ఆస్పత్రి గేటువైపు దబదబా అడుగులు వేసాడతను.

ఆ ఆస్పత్రి పేరు "గవర్నమెంట్ హాస్పిటల్ ఫర్ మెంటల్ డిసీజెస్".

తెలుగులో దానిని పిచ్చాసుపత్రి అంటారు.

# నన్ను శిక్షించండి

హైదరాబాద్ సిటీ సివిల్‌కోర్టులుండే ఆవరణలో, చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో ఆరోజు కేసులు ఎక్కువగా వున్నాయి.

ఉదయం పదకొండు పదికి ఆయన మొదటి కేసుని విచారించ సాగాడు.

కోర్టు, కోర్టు వాతావరణం అంటే ఏమాత్రం తెలియని ఓ యాభై అయిదేళ్ళ ముసలాయన విజిటర్స్ కోసం ప్రత్యేకించబడ్డ చెక్క బెంచీలో కూర్చుని బిక్కు బిక్కు మంటూ అక్కడ జరిగే తతంగాన్ని చూ స్తున్నాడు.

పోలీసులు రకరకాల నేరసులని, దొంగలని, దొంగతనం చేయించిన వాళ్ళని, వ్యభిచారులని, వ్యభిచారగృహాలను నడిపేవారిని, జూదగాళ్ళని అనేక మందిని తీసుకవస్తున్నారు. చాలా మంది తమ నేరాలను వప్పుకుంటున్నారు మేజిస్ట్రేట్ వారికి వారి నేరాలని బట్టి శిక్ష విధిస్తున్నారు.

లంచి విరామంలో గంటకొట్టారు. పోలీసులు, కోర్టు క్లర్కు, ప్యూన్, మెజిస్ట్రేట్, లాయర్లు సాక్షులు.... అంతా లంచ్‌కి వెళ్ళినా ఆ ముసలాయన మాత్రం కూర్చున్న చోటునించి కదలలేదు.

నేలవైపు చూస్తూ దీర్ఘంగా ఏదో ఆలోచిస్తున్నాడు. మధ్యమధ్యలో తనలోతనే ఏదో గొణుక్కుంటున్నాడు. అరగంటకోసారి తన చేతి సంచి లోంచి కొన్ని కాగితాలని బయటకి తీసి చూసుకొని, తృప్తిగా తలాడించి మళ్ళీ వాటిని కరెన్సీ నోట్లకన్నా భద్రంగా ఆ సంచిలో దాస్తున్నాడు.

లంచ్ అవర్ అయిందన్న గురుగా గంట మోగింది. మెజిస్ట్రేట్ మళ్ళీ వచ్చాడు. పోలీసులు, ప్యూన్, కోర్టుక్లర్కు, సాక్షులు అంతా మళ్ళీ వచ్చారు.

ఒక్కొక్కరికి శిక్షలు విధిస్తున్న మెజిస్ట్రేటు ఆ ముసలాయనకి అపరపరమాత్మలా కనిపిస్తున్నాడు.

"మీకేం కావాలి?" ఉదయం నుంచి కదలకుండా అక్కడే కూర్చుని వున్న ఆ ముసలాయనని గమనిస్తున్న మెజిస్ట్రేట్ అకస్మాత్తుగా అడిగాడు.

ఆయన కొద్దిగా తడబడ్డాడు. వెంటనే లేచి నిలబడ్డాడు. కుడిచేతిలోని సంచిని ఎడంచేతిలోకి మార్చుకున్నాడు, మెజిస్ట్రేట్ దగ్గరకు నడిచాడు.

అందరి కళ్ళూ ఆయన్నే గమనిస్తున్నాయి. చేతి సంచీలోంచి కాగితాలని తీసి మెజిస్ట్రేట్‌కి అందించి చెప్పాడాయన.

"పందొమ్మిది వందల యాభై నాలుగులో నేను విజయవాడలో పి. డబ్ల్యు. డి. లో పని చేస్తుండగా, ఎనిమిదివందలు లంచం తీసుకున్నాను ఇందులో భాగస్వామ్యం మా సూపరింటెండెంట్‌కి కూడా వుంది కాని ఆయన మరణించి నాలుగేళ్ళయింది, లంచం తీసుకున్న నేరానికి నన్ను శిక్షించవలసిందిగా కోరుతున్నాను. ఈ సంగతి రుజువు చేసే కాగితాలు అవి."

మెజిస్ట్రేట్ కాగితాలు పరిశీలించి ఆశ్చర్యంగా అడిగాడు

"ఇన్నేళ్ళ తర్వాత మీలో ఈ ధర్మబుద్ధి ఎలా కలిగింది?"

"మొన్ననే రిటైరయ్యా" పొడిగా చెప్పాడాయన

"జైల్లో వుంటే భోజనం దొరుకుతుందనా?" అడిగాడు అడ్వకేట్.

ఆయన తల అడ్డంగా ఆడించి చెప్పాడు దిగులుగా

"నా భార్య, తొమ్మిది మంది పిల్లలతో ఆ ఇంట్లో గడిపే కంటే జైలే మంచి చోటు."

# మీ వుద్యోగం వద్దు

సారంగపాణి ఇంటర్వ్యూలకి పిలిచిన అభ్యర్థుల జాబితాలని తిరగేసాడు. ఆరో అభ్యర్థి పేరు అతన్ని ఆకర్షించింది.

డబ్ల్యు. కె. వి. చలపతి।

ఈ సారి అతన్ని అడగాల్సిన ప్రశ్నలు ఎన్నో అన్నీ మనసులో నోటు చేసుకున్నాడు.

పదకొండున్నరకి ఇంటర్వ్యూ మొదలయింది. ఫుడ్ టెక్నాలజీ చేసి, వివిధ కంపెనీల్లో పని చేసే అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్నారు. "సారంగపాణి ఫుడ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ చైర్మెన్ సారంగపాణి".